సాక్షి సూర్యాపేట

గురువారం । 25 । జనవరి । 2024



మట్టపల్లిలో కల్యాణం
మట్టపల్లి లక్ష్మీనృసింహుడి ఆలయంలో నిత్య కల్యాణాన్ని బుధవారం అర్చకులు నిర్వహించారు.
- 8లో



భక్తులకు ఇబ్బందులు లేకుండా..
యాదాద్రి క్షేత్రంలో భక్తులకు ఇబ్బందులు కలగకుండా చూడాలని మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి కోరారు.
- 8లో



సస్పెన్షన్‌ను నిరసిస్తూ ..
కొండమల్లేపల్లి ఎస్సీ గురుకులం ప్రిన్సిపాల్‌పై సస్పెన్షన్ వేటు వేయడంతో విద్యార్థినులు ఆందోళన చేశారు.
- 10లో

న్యూస్‌రీల్

కలెక్టర్‌కు రాష్ట్ర స్థాయి అవార్డు



వెంకట్రావు, కలెక్టర్

దురాజ్‌పల్లి (సూర్యాపేట) : జిల్లా కలెక్టర్ ఎస్. వెంకట్రావు 2023 బెస్ట్ ఎలక్టోరల్ ప్రాక్టీసెస్ విభాగం కింద రాష్ట్ర స్థాయి అవార్డుకు ఎంపిక య్యారు. అసెంబ్లీ ఎన్నికల నిర్వహణలో కలెక్టర్ ఉత్తమ ప్రతిభ కనబరిచినందుకు రాష్ట్ర ఎన్నికల సంఘం గుర్తించింది. ఈమేరకు బుధవారం ఉత్తర్వులు జారీ చేసింది. గురువారం జాతీయ ఓటర్ల దినోత్సవం సందర్భంగా హైదరాబాద్‌లోని జేఎన్‌టీయూ ఆడిటోరియంలో రాష్ట్ర గవర్నర్ తమిళిసై సౌందరరాజన్ చేతుల మీదుగా ఈ అవార్డును అందుకోనున్నారు.

రక్తహీనతకు చెక్ పెట్టేలా చర్యలు



మాట్లాడుతున్న జిల్లా వైద్యాధికారి కోటాచలం

కోదాడఅర్బన్ : విద్యార్థుల్లో రక్తహీనతకు చెక్ పెట్టేలా చర్యలు తీసుకుంటున్నట్లు డీఎంహెచ్‌ఓ కోటా చలం తెలిపారు. బుధవారం కోదాడలోని సీసీరెడ్డి కాన్వెంట్‌లో ఎనీమియా ముక్త్‌భారత్ కార్యక్రమాన్ని డీఎంహెచ్‌ఓ ప్రారంభించి మాట్లాడారు. ప్రస్తుతం విద్యార్థులు చాలా మంది రక్తహీనతతో బాధపడుతున్నారని వీరికి పరీక్షలు నిర్వహించి ఐరన్ మాత్రలు ఇవ్వనున్నట్లు ఆయన చెప్పారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ డీఎంహెచ్‌ఓ డాక్టర్ నిరంజన్, డాక్టర్ నాజియా, మెడికల్ ఆఫీసర్ డాక్టర్ శైలజ, డాక్టర్ అశోక్‌కుమార్, ఎంఈఓ సలీం షరీఫ్, ఫార్మసిస్ట్ మంగమ్మ, ఏఎన్ఎం ఖుర్షీదా, ఆశావర్కర్లు సావిత్రి , నాగేంద్ర తదితరులు పాల్గొన్నారు.


చిమిర్యాల పీఏసీఎస్ చైర్మన్‌గా రఘుపతి



నియామకపత్రం అందుకుంటున్న రఘుపతి

కోదాడ రూరల్: కోదాడ మండలం చిమిర్యాల ప్రాథమిక సహకార సంఘం నూతన చైర్మన్‌గా రఘుపతి, ఉపాధ్యక్షుడిగా పత్తిపాక రామకృష్ణలను బుధవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సంఘం చైర్మన్, వైస్‌చైర్మన్‌లపై మంగళవారం పెట్టిన అవిశ్వాస తీర్మానం నెగ్గడంతో నూతనంగా ఎన్నుకున్నారు. అధికారులు రఘుపతికి నూతన చైర్మన్‌గా నియామక పత్రాలను అందించారు. రఘుపతి మాట్లాడుతూ తమ నియామకానికి సహకరించిన సంఘం డైరెక్టర్లకు, కాంగ్రెస్ నేతలకు కృతజ్ఞతలు తెలిపారు.

26న ట్రాక్టర్ల ర్యాలీకి సీపీఎం మద్దతు



మాట్లాడుతున్న మల్లు నాగార్జున్ రెడ్డి

దురాజ్‌పల్లి (సూర్యాపేట) : కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక, కర్షక, వ్యవసాయ కార్మిక వ్యతిరేక విధానాలకు నిరసనగా ఈనెల 26న దేశ వ్యాప్తంగా నిర్వహించే ట్రాక్టర్ల ర్యాలీకి సీపీఎం సంపూర్ణ మద్దతు తెలియజేస్తుందని పార్టీ జిల్లా కార్యదర్శి మల్లు నాగార్జున్‌రెడ్డి వెల్లడించారు. బుధవారం సూర్యాపేట పట్టణంలోని సీపీఎం కార్యాలయంలో నిర్వహించిన కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. బీజేపీకి కేంద్రంలో అధికారంలో ఉండే అర్హత లేదన్నారు. సూర్యాపేటలో నిర్వహించే ట్రాక్టర్ల ర్యాలీలో సీపీఎం కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. పార్టీ జిల్లా కమిటీ సభ్యుడు మేకనబోయిన శేఖర్ అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో నెమ్మాది వెంకటేశ్వర్లు, మట్టిపల్లి సైదులు, కోట గోపి, ఎల్గూరి గోవింద్, వెంకటరెడ్డి పాల్గొన్నారు.

రెండు రోజులు యాగం

చివ్వెంల(సూర్యాపేట) : ఉండ్రుగొండ గిరిదుర్గంలోని శ్రీలక్ష్మీనర్సింహస్వామి ఆలయంలో గురు, శుక్రవారం శ్రీ సర్వకామప్రద సుదర్శన సహిత శ్రీలక్ష్మీనరసింహ యాగం నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. బుధవారం చివ్వెంలలో విలేకరులతో మాట్లాడారు. అంకురార్పణతో మొదలై పూర్ణాహుతితో ముగించనున్నట్లు తెలిపారు. సమావేశంలో చకిలం కృష్ణకుమార్, మధుసూదనరావు, బండకవి కృష్ణమోహన్ పాల్గొన్నారు.




సైదన్న ఉర్సుకు వేళాయె

పాలకవీడు మండలంలోని జాన్‌పహాడ్ సైదన్న దర్గా ఉర్సుకు ముస్తాబైంది. గురువారం నుంచి మూడు రోజుల పాటు ఉత్సవాలు జరగనున్నాయి. నిర్వాకులు అన్ని ఏర్పాట్లు చేశారు.

అటెండెన్స్ యాప్!

లొకేషన్ ఆధారిత హాజరుకు యాప్ రూపకల్పన

- ఉద్యోగులు సమయ పాలన పాటించేలా నూతన విధానం
- ఇటీవల కలెక్టరేట్‌లో ప్రారంభం
- త్వరలో అన్ని ప్రభుత్వ కార్యాలయాల్లో అమలుకు సన్నాహాలు
- వ్యతిరేకిస్తున్న ఓ ఉద్యోగ సంఘం
- ప్రైవసీ పేరుతో అడ్డుకునేందుకు ప్రయత్నం



దురాజ్‌పల్లి (సూర్యాపేట) : ఉద్యోగులు సమయ పాలన పాటించేలా కలెక్టర్ ప్రత్యేక చొరవతో డిస్ట్రిక్ట్ అటెండెన్స్ మేనేజ్‌మెంట్ యాప్‌ను తీసుకొచ్చారు. యాప్ ఆధారిత అటెండెన్స్ విధానాన్ని ఇటీవల కలెక్టరేట్‌లో ప్రారంభించారు. యాప్‌పై ఉన్న సందేహాలను నివృత్తి చేయడానికి ఉద్యోగులకు సోమవారం శిక్షణ కూడా ఇచ్చారు. త్వరలో దీనిని జిల్లా వ్యాప్తంగా అన్ని ప్రభుత్వ కార్యాలయాల్లో అమలు చేసేందుకు సన్నాహాలు చేస్తున్నారు. కాగా ఈ అటెండెన్స్ విధానాన్ని ఓ ఉద్యోగ సంఘం వ్యతిరేకిస్తున్నట్లు తెలిసింది.

యాప్‌లో అటెండెన్స్ ఇలా..

జిల్లాలో పని చేస్తున్న ఉద్యోగులు తమ హాజరును ఆన్‌లైన్ ద్వారా నమోదు చేసుకునేలా డిస్ట్రిక్ట్ అటెండెన్స్ మేనేజ్ మెంట్ యాప్‌ను రూపొందించారు. ఉద్యోగి ముందు తాను పనిచేస్తున్న కార్యాలయం లొకేషన్ నుంచి ఎంప్లాయ్ ఐడీ ద్వారా యాప్‌లో రిజిస్ట్రేషన్ చేసుకోవాలి. ఈ ఐడీ ట్రెజరీ కార్యాలయంతో అనుసంధానమై ఉంటుంది. ఉద్యోగులు కార్యాలయానికి వచ్చినప్పుడు 'చెక్ ఇన్', కార్యాలయం నుంచి వెళ్లినప్పుడు 'చెక్ అవుట్' యాప్‌లో నమోదు చేసుకోవాలి. ఇలా నమోదు చేస్తే రోజూ ఉద్యోగి ఎన్ని గంటలు పని చేసింది, నెలలో ఎన్ని సెలవులు తీసుకున్నది యాప్‌లో కనబడుతుంది. చెక్ ఇన్, చెక్ అవుట్ కొట్టే సమయంలో మాత్రమే లొకేషన్ పడుతుంది. మిగిలిన సమయంలో యాప్ లొకేషన్ ట్రేస్ అయ్యే అవకాశం లేదు. ఇక ఫీల్డ్ విజిట్‌లో ఉన్న ఉద్యోగులు ఫీల్డ్ నుంచి చెక్ ఇన్, చెక్ అవుట్ నమోదు చేసే అవకాశం ఇచ్చారు. ఇంకా ఉద్యోగుల అవసరం మేరకు మార్పులు చేసే అవకాశం కూడా ఉంది. ఈ యాప్ ఆధారిత అటెండెన్స్‌ను ప్రస్తుతం ట్రయల్‌గా కలెక్టరేట్‌లో అమలు చేస్తున్నారు.

యాప్ అంటే భయమెందుకో..

యాప్ ఆధారిత హాజరు అనగానే కొందరు ఉద్యోగుల్లో భయం పుట్టుకొస్తున్నట్లు తెలుస్తోంది. పని వేళల కంటే ఎక్కువ సమయమే విధులు నిర్వహిస్తున్నామని..యాప్ అటెండెన్స్ పేరుతో తమను ఇబ్బందులకు గురి చేయవద్దని కొందరు సిబ్బంది ఇటీవల కలెక్టర్‌ను కలిసి వినతిపత్రం సమర్పించారు. అయితే యాప్ ఆధారిత అటెండెన్స్‌పై కలెక్టరేట్‌లో పని చేస్తున్న కొందరు సిబ్బందిని సాక్షి పలకరించగా యాప్‌తో తమకు అంతగా ఇబ్బంది లేదని చెబుతున్నారు. అయితే విధుల్లో సమయపాలన పాటించని వారే కావాలని వ్యతిరేకిస్తున్నారని, పని వేళల కంటే ఎక్కువ సమయం ఉద్యోగులు ఉంటే యాప్‌లో నమోదు అవుతుంది కాబట్టి మంచి పేరు వస్తుందే తప్ప నష్టం లేదంటున్నారు.

ప్రైవసీ పేరుతో..

ఇప్పటికే తాము వాడుతున్న సెల్ ఫోన్‌లో అనేక రకాల యాప్‌లు ఉన్నాయని, ఈ అటెండెన్స్ యాప్‌కు స్పేస్ కష్టమని, డేటా బ్యాలెన్స్ తమకు అదనపు భారమని, ఫోన్‌లు, సిమ్‌లు ప్రభుత్వం కొని ఇచ్చినవి కావని, ఈ యాప్ ద్వారా తమ పర్సనల్ ప్రైవసీకి భగం కలిగే అవకాశం ఉందని కొందరు ఉద్యోగులు అంటున్నారు. అయితే యాప్ ద్వారా వ్యక్తిగత ప్రైవసీకి ఎలాంటి భంగం కలగదని దీనిని రూపొందించిన ఇంజనీరు తెలిపారు. నిత్యం ఉపయోగించే సోషల్ మీడియా యాప్‌లు, బ్యాంకింగ్ యాప్‌ల వల్ల కోల్పోని ప్రైవసీ ఈ యాప్‌తో ఎలా కోల్పోతారన్న వాదనే వినిపిస్తోంది. వాట్సప్, ఫేస్‌బుక్, యూ ట్యూబ్‌లు చూసేందుకు డేటా ఉంటుంది కానీ రోజుకు రెండు సార్లు వేసే అటెండెన్స్‌కు ఎందుకు ఉండదని, కేవలం సమయపాలన నుంచి తప్పించుకోవడానికే ఇలాంటి వాదనలు తెరపైకి తెస్తున్నారన్న విమర్శలున్నాయి. కాగా స్మార్ట్ ఫోన్ లేని సిబ్బందికి మాత్రం కాస్త భారం తప్పదంటున్నారు.

మున్సిపాలిటీల్లో అంచనా బడ్జెట్ రూపొందించాలి

- కలెక్టర్ వెంకట్రావు



మాట్లాడుతున్న కలెక్టర్ వెంకట్రావు

దురాజ్‌పల్లి (సూర్యాపేట) : మున్సిపాలిటీలు ప్రజల అవసరాలకు అనుగుణంగా అంచనా బడ్జెట్ రూపొందించాలని కలెక్టర్ ఎస్. వెంకట్రావు తెలిపారు. మున్సిపాలిటీల్లో బడ్జెట్ తయారీపై బుధవారం కలెక్టరేట్‌లో అదనపు కలెక్టర్లు సీహెచ్ ప్రియాంక, ఎ. వెంకట్‌రెడ్డిలతో కలిసి నిర్వహించిన సమావేశంలో కలెక్టర్ మాట్లాడారు. రానున్న వేసవిని దృష్టిలో పెట్టుకొని మున్సిపాలిటీల్లో తాగునీటి సమస్య ఉత్పన్నం కాకుండా చూడాలని ఆదేశించారు. మున్సిపల్ అధికారులు మిషన్ భగీరథ అధికారులు సమన్వయంతో పనిచేసి నీటి సరఫరా సక్రమంగా జరిగేలా చూడాలన్నారు. అన్ని మున్సిపాలిటీల్లో ఇంటిగ్రేటెడ్ నాన్ వెజ్ మార్కెట్, మురుగునీటి శుద్ధి ప్లాంట్లు, వైకుంఠధామాలు, ఆధునిక ధోబీగాట్లలను సకాలంలో పూర్తి చేయాలన్నారు. తడి పొడి చెత్తను వేరుచేసి ఇంటింటి చెత్త సేకరణ కార్యక్రమం నిర్మాణాత్మకంగా వంద శాతం చేయాలన్నారు. పట్టణాల్లో ఆసిపన్ను వసూళ్లు సకాలంలో 100 శాతం పూర్తి చేయాలన్నారు. ప్రత్యేక డ్రైవ్ ద్వారా పాతబకాయిలు వసూలు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో సూర్యాపేట, కోదాడ, తిరుమలగిరి, నేరేడుచర్ల మున్సిపల్ కమిషనర్లు రామానుజులరెడ్డి, వెంకటేశ్వర్లు నాయక్, దండు శ్రీను, ఎన్. వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

విద్య ద్వారానే మహిళలకు సమానత్వం



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న అదనపు కలెక్టర్ ప్రియాంక, సీనియర్ సివిల్ జడ్జి శ్రీవాణి



విజేతలకు బహుమతులు అందజేస్తున్న అదనపు కలెక్టర్, సీనియర్ సివిల్ జడ్జి

- అదనపు కలెక్టర్ ప్రియాంక

సూర్యాపేట రూరల్ : విద్య ద్వారానే మహిళలకు సమానత్వం దక్కుతుందని జిల్లా అదనపు కలెక్టర్ సీహెచ్.ప్రియాంక అన్నారు. సూర్యాపేట మండలంలోని ఇమాంపేట సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ స్కూల్ (బాలికల)లో జాతీయ బాలికా దినోత్సవాన్ని జిల్లా మహిళా సాధికారత కేంద్రం ఆధ్వర్యంలో బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని అదనపు కలెక్టర్ ప్రియాంక, జిల్లా సీనియర్ సివిల్ జడ్జి శ్రీవాణితో కలిసి జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు అదనపు కలెక్టర్ మాట్లాతుతూ బాల్యం నుంచే క్రమశిక్షణగా ఉంటూ ఇష్టంతో చదువుకొని ఉన్నత స్థానానికి ఎదగాలన్నారు. జిల్లా సీనియర్ సివిల్ జడ్జి శ్రీవాణి మాట్లాడుతూ సినిమాలు చూస్తూ యువత చెడు అలవాట్లకు బానిస అవుతున్నారన్నారు. విజేతలకు బహుమతులు అందజేశారు. బేటీ బచావో బేటీ పడావో పేరుతో రూపొందించిన గాలిపటాలను అదనపు కలెక్టర్ ఎగురవేశారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ఝాన్సీరాణి , చైల్డ్ వెల్ఫేర్ కమిటీ చైర్మన్ బి. రమణ రావు, డిస్ట్రిక్ట్ చైల్డ్ ప్రొటెక్షన్ ఆఫీసర్ రవికుమార్ , జిల్లా మహిళ సాధికారత కేంద్రం కో ఆర్డినేటర్ చైతన్య పాల్గొన్నారు.

పెండింగ్ కేసులను త్వరగా పరిష్కరించాలి : ఎస్పీ

సూర్యాపేట క్రైం: పెండింగ్ కేసులను త్వరగా పరిష్కరించాలని ఎస్పీ రాహుల్ హెగ్డే ఆదేశించారు. బుధవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో అదనపు ఎస్పీ నాగేశ్వర్‌రావుతో కలిసి నిర్వహించిన నెలవారీ సమీక్షా సమావేశంలో ఎస్పీ మాట్లాడారు. మిస్సింగ్ కేసుల్లో అలసత్వం వహించవద్దన్నారు. మహిళా బాధితులకు త్వరితగతిన న్యాయం జరిగి, నేరస్తులకు శిక్షలు పడితే నేరాలు తగ్గుతాయన్నారు. సమావేశంలో డీఎస్పీలు నాగభూషణం, ప్రకాష్, రవి, స్పెషల్ బ్రాంచ్ ఇన్‌స్పెక్టర్లు రాజేష్, మహేష్, సీసీఎస్ సీఐ నాగార్జున, సీఐలు శివ శంకర్, రాజశేఖర్, మురారి, రాము, వీర రాఘవులు పాల్గొన్నారు.

యువత ఓటరుగా నమోదు చేసుకోవాలి



క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న అదనపు కలెక్టర్ వెంకట్‌రెడ్డి



కబడ్డీలో తలపడుతున్న క్రీడాకారులు

- అదనపు కలెక్టర్ వెంకట్‌రెడ్డి

సూర్యాపేటటౌన్ : పద్దెనమిదేళ్లు నిండిన యువత ఓటరుగా నమోదు చేసుకోవాలని జిల్లా అదనపు కలెక్టర్ వెంకట్‌రెడ్డి సూచించారు. నేషనల్ ఓటర్స్ డేను పురస్కరించుకొని బుధవారం సూర్యాపేట జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో ఉద్యోగులకు జిల్లా స్థాయి కబడ్డీ పోటీలు నిర్వహించారు. ఈ పోటీలను ఆయన ప్రారంభించి మాట్లాడారు. ప్రతి ఓటరు తమ ఓటు హక్కును వినియోగించుకోవాలన్నారు. అలాగే 2020 కంటే ముందు డిగ్రీ పూర్తి చేసిన ప్రతి ఒక్కరూ ఎమ్మెల్సీ ఎన్నికలకు ఓటరుగా పేరు నమోదు చేసుకోవాలన్నారు. ఈ కబడ్డీ పోటీల్లో హుజూర్‌నగర్ టీం ప్రథమ, కోదాడ -ఏ టీం ద్వితీయ, కోదాడ -బీ టీం తృతీయ స్థానం సాధించాయి. వీరికి 25వ తేదీన బహుమతులు అందజేయనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా క్రీడల అధికారి వెంకట్‌రెడ్డి, డీఈఓ అశోక్, ఆర్డీఓ కృష్ణయ్య, తహసీల్దార్‌లు శ్యాంసుందర్‌రెడ్డి, మహేందర్‌రెడ్డి, రంగారావ్, సాయి, ఎస్‌జీఎఫ్ సెక్రటరీ అజీమ్‌బాబా, పీఈటీలు పాల్గొన్నారు.

బ్యాలెట్ పద్ధతిలో ఓటు వినియోగించుకోవాలి



మాట్లాడుతున్న మామిడి శ్యాంసన్

భానుపురి (సూర్యాపేట) : వచ్చే నెల 5వ తేదీన నిర్వహించే సూర్యాపేట నియోజకవర్గ పాస్టర్స్ ఫెలోషిప్ కమిటీ ఎన్నికకు సభ్యులు బ్యాలెట్ పద్ధతిలో ఓటు హక్కు వినియోగించుకోవాలని పాస్టర్స్ ఫెలోషిప్ జిల్లా చైర్మన్ మామిడి శ్యాంసన్, అధ్యక్షుడు కాసర్ల శ్రావణ్‌కుమార్, ఎలక్షన్ కమిటీ చైర్మన్ సాయిని జాకబ్‌లు తెలిపారు. బుధవారం సూర్యాపేటలో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. సూర్యాపేటలోని శాంతినగర్ సిలోయం వర్షిప్ సెంటర్‌లో ఉదయం 10గంటల నుంచి మధ్యాహ్నం 1గంట వరకు పోలింగ్ ఉంటుందన్నారు. అదేరోజు 3గంటలకు ఎన్నికల ఫలితాలు ఉంటాయన్నారు. సమావేశంలో సుదర్శన్, మీసాల ప్రభుదాస్, జోహార్ పాల్, మరియన్న, లాజర్ నాయక్, మీసాల గోవర్ధన్, పుల్లూరు దానియేలు, జలగం డేవిడ్‌రాజ్, పూజర్ల సామెల్ కిరణ్, కరుణాకర్, రమేష్ బాబు, సాల్మన్ లింగ నాయక్, నిర్మలబాబు, సత్య ప్రకాష్, పెరిక దాస్, జి.సాలోమోను రాజు, పేరాల రాజరత్నం, పలస సంజీవ, కోక ఏసురత్నం, బొడ్డు మత్తయి, కోదూరు ఎజ్రా, ప్రసన్న కుమార్, మచ్చ ఏసుపాదం, కందుకూరి ఏసురాజు, బాలరాజు తదితరులు పాల్గొన్నారు.

యాదాద్రిలో నిత్యారాధనలు



కల్యాణం నిర్వహిస్తున్న ఆలయ అర్చకులు

యాదగిరిగుట్ట రూరల్: యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయంలో బుధవారం నిత్యపూజలు కొనసాగాయి. అర్చకులు వేకువజామునే ఆలయాన్ని తెరిచి స్వయంభూ, ప్రతిష్ఠా అలంకార మూర్తులకు సుప్రభాత సేవ నిర్వహించారు. ఆ తర్వాత అర్చనలు, అభిషేకాలు చేపట్టారు. ముఖ మండపంలో సువర్ణ పుష్పార్చన మూర్తులకు అష్టోత్తర పూజలు గావించారు. ఇక ప్రథమ ప్రాకార మండపంలో శ్రీ సుదర్శన నారసింహ హోమం, గజవాహనసేవ, నిత్యకల్యాణం, బ్రహ్మోత్సవం, జోడుసేవా కార్యక్రమాలు జరిపారు. వివిధ విభాగాల ద్వారా రూ.16,80479 నిత్యాదాయం సమకూరిందని ఆలయ అధికారులు వెల్లడించారు.

వైస్ చైర్మన్‌పై నెగ్గిన అవిశ్వాసం

- హుజూర్‌నగర్ మున్సిపల్ సమావేశానికి 29 మంది సభ్యులకు 24 మంది హాజరు
- అనుకూలంగా 22మంది, వ్యతిరేకంగా ఇద్దరు కౌన్సిలర్లు..
- నలుగురు కౌన్సిలర్లు, ఒక ఎక్స్ అఫీషియో సభ్యుడు గైర్హాజర్



అవిశ్వాసానికి అనుకూలంగా చేతులెత్తిన మున్సిపల్ కౌన్సిలర్లు



మాట్లాడుతున్న ఆర్డీఓ జగదీశ్వర్‌రెడ్డి

హుజూర్‌నగర్ : హుజూర్‌నగర్ మున్సిపల్ వైస్ చైర్మన్ జక్కుల నాగేశ్వరరావుపై పెట్టిన అవిశ్వాస తీర్మానం నెగ్గింది. బుధవారం హుజూర్‌నగర్ పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన అవిశ్వాస తీర్మాన సమావేశానికి 24 మంది హాజరుకాగా 22 మంది అనుకూలంగా, ఇద్దరు వ్యతిరేకంగా చేతులెత్తారు. దీంతో అవిశ్వాసం నెగ్గినట్లు ఆర్డీఓ ప్రకటించారు. మున్సిపాలిటీలో మొత్తం 28 మంది కౌన్సిలర్లు కాగా వీరిలో కాంగ్రెస్ 18, సీపీఎం ఒకరు, బీఆర్ఎస్ 9 మంది ఉన్నారు. ఎక్స్ అఫీషియో సభ్యుడు మంత్రి ఉత్తమ్‌కుమార్‌తో కలుపు కుంటే సభ్యుల సంఖ్య 29కి చేరింది. కాంగ్రెస్‌కు చెందిన 18 మంది కౌన్సిలర్లు వైస్ చైర్మన్‌పై అవిశ్వాసం ప్రకటిస్తూ గతనెల 30న కలెక్టరేట్‌లో వినతిపత్రం అందజేయగా జనవరి 24న సమావేశం నిర్వహించాలని కలెక్టర్ నిర్ణయించిన విషయం విదితమే.

11 గంటల వరకు ఒక్కొక్కరుగా..

రిటర్నింగ్ ఆఫీసర్, ఆర్డీఓ జగదీశ్వర్‌రెడ్డి అధ్యక్షతన స్థానిక మున్సిపల్ కార్యాలయంలో అవిశ్వాస తీర్మాన సమావేశం ఏర్పాటు చేశారు. అయితే క్యాంప్‌నకు వెళ్లిన సభ్యులతో పాటు ఇతర కౌన్సిలర్లు ఉదయం 11 గంటల వరకు ఒక్కొక్కరుగా కార్యాలయం వద్దకు చేరుకున్నారు. ఈ సమావేశానికి 24మంది హాజరయ్యారు. 19 మంది కోరం పూర్తి కావడంతో సమావేశం నిర్వాహించారు. అవిశ్వాసానికి అనుకూలంగా 22 మంది కౌన్సిలర్లు చేతులెత్తారు. వీరిలో కాంగ్రెస్ పార్టీకి చెందిన 18 మంది, సీపీఎం ఒకరు, బీఆర్ఎస్‌కు చెందిన ముగ్గురు కౌన్సిలర్లు ఉన్నారు. బీఆర్ఎస్‌కు చెందిన కౌన్సిలర్లు జక్కుల వీరయ్య, అట్లూరి మంజుల ఈ అవిశ్వాసానికి వ్యతిరేకంగా చేతులెత్తారు. ఎక్స్‌అఫీషియో సభ్యుడిగా ఉన్న మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డితో పాటు బీఆర్ఎస్‌కు చెందిన వైస్ చైర్మన్ జక్కుల నాగేశ్వరరావు, కౌన్సిలర్లు దొంగరి మంగమ్మ, గుండా ఫణి కుమారి, కేఎల్ఎన్ రావు గైర్హాజరయ్యారు. వైస్‌చైర్మన్‌పై అవిశ్వానికి 22 మంది మద్దతు తెలుపడంతో తీర్మానం నెగ్గినట్లు రిటర్నింగ్ ఆఫీసర్ జగదీశ్వర్‌రెడ్డి ప్రకటించారు. దీనికి సంబంధించిన నివేదికను కలెక్టర్‌కు పంపుతామని తెలిపారు. మళ్లీ వైస్ చైర్మన్ ఎన్నిక కోసం ఎన్నికల సంఘం తేదీని ప్రకటిస్తుందని ఆయన చెప్పారు.

కాంగ్రెస్ నాయకుల సంబరాలు..

బీఆర్ఎస్‌కు చెందిన మున్సిపల్ వైస్ చైర్మన్‌పై అవిశ్వాసం నెగ్గడంతో కాంగ్రెస్ నాయకులు సంబరాలు జరుపుకున్నారు. బాణసంచా కాల్చి, మిఠాయిలు పంచారు. ఒకరికొకరు శుభాకాంక్షలు తెలుపుకున్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ గెల్లి అర్చన రవి, కౌన్సిలర్లు కోతి సంపత్‌రెడ్డి, కస్తాల శ్రవణ్ కుమార్, సరితా వీరారెడ్డి, వేముల వరలక్ష్మీ నాగరాజు, రాజానాయక్, బొల్లెద్దు ధనమ్మ జైలు, కారింగుల విజయ వెంకటేశ్వర్లు, అమరబోయిన సతీష్, ఓరుగంటి నాగేశ్వరరావు, కొమ్ము శ్రీను, జక్కుల శంభయ్య, వీర్లపాటి గాయత్రి భాస్కర్, యరగాని గురవయ్య, కుంట ఉపేంద్ర సైదులు, చిలకబత్తిని సౌజన్య, గుంజా భవాని, అస్మా నజీర్, ఎం. రాం గోపి, ఎ. గంగరాజు తదితరులు పాల్గొన్నారు.

సమావేశాన్ని విజయవంతం చేయాలి

నల్లగొండ : కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో పార్లమెంట్ ఎన్నికల సన్నద్ధతలో భాగంగా గురువారం హైదరాబాద్‌లోని ఎల్‌బీ స్టేడియంలో నిర్వహించే బూత్ స్థాయి కార్యకర్తల సమావేశానికి ఉమ్మడి జిల్లా నుంచి పార్టీ శాఖల అధ్యక్షులు హాజరై విజయవంతం చేయాలని రాష్ట్ర నీటి పారుదల శాఖ మంత్రి, నల్లగొండ పార్లమెంట్ నియోజకవర్గ కో ఆర్డినేటర్ ఉత్తమ్ బుధవారం ఒక ప్రకటనలో కోరారు. ఈ సమావేశం సీఎం రేవంత్‌రెడ్డి అధ్యక్షతన మధ్యాహ్నం రెండు గంటలకు ప్రారంభమవుతుందని తెలిపారు. సమావేశానికి ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే హాజరవుతారని పేర్కొన్నారు.

సాగునీటిని విడుదల చేసి పంటలను కాపాడాలి

- మంత్రి ఉత్తమ్‌కు రైతు సంఘం నాయకుల వినతి



ఉత్తమ్‌కు వినతిపత్రం ఇస్తున్న నాయకులు

మిర్యాలగూడ : నాగార్జునసాగర్ ఎడమకాల్వకు నీటిని విడుదల చేసి పంట పొలాలను కాపాడాలని తెలంగాణ రైతు సంఘం ఆధ్వర్యంలో బుధవారం హైదరాబాద్‌లో మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డికి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డి, రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పోతినేని సుదర్శన్, కార్యదర్శి టి.సాగర్ మాట్లాడుతూ నాగార్జునసాగర్ ఎడమకాల్వ ఆయకట్టు పరిధిలో నల్లగొండ, సూర్యాపేట, ఖమ్మం జిల్లాల్లోని రైతులు సాగునీరు వస్తుందన్న ఆశతో కొందరు రైతులు వరిసాగు చేశారని.. తీరా సాగునీరు అందకపోవడంతో అవి ఎండిపోయే దశకు చేరుకున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం స్పందించి 10రోజుల పాటు సాగర్ ఎడమకాల్వకు నీటిని విడుదల చేయాలని కోరారు. వారి వెంట శోభన్, బసవయ్య తదితరులు ఉన్నారు.

క్లుప్తంగా

గాయపడిన యువకుడు మృతి

మునగాల(కోదాడ): రోడ్డు ప్రమాదంలో గాయపడి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న యువకుడు మృతిచెందాడు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం గుంటూరుకు చెందిన కేవీఎస్‌రాజు(18), కార్తీక్‌లు పని నిమిత్తం ఈ నెల 23(మంగళవారం)న బైక్‌పై హైదరాబాద్‌కు బయలుదేరారు. మార్గమధ్యలో సూర్యాపేట జిల్లా మునగాల మండలం ముకుందాపురం వద్ద జాతీయ రహదారిపై వీరి బైక్ అదుపుతప్పి డివైడర్‌ను ఢీకొట్టింది. ప్రమాదంలో బైక్‌పై ప్రయాణిస్తున్న ఇద్దరికి గాయాలయ్యాయి. స్థానికులు 108 వాహనంలో క్షతగాత్రులను కోదాడ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ప్రమాద సమాచారం అందుకున్న క్షతగాత్రుల కుటుంబ సభ్యులు కోదాడ ఆస్పత్రికి చేరుకుని వారిని విజయవాడకు తరలించారు. అక్కడ ఓ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ కేవీఎస్ రాజు బుధవారం తెల్లవారుజామున మృతిచెందాడని, ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు మునగాల పోలీసులు తెలిపారు.

మట్టపల్లి నృసింహుడి నిత్యకల్యాణం



కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

మఠంపల్లి: మఠంపల్లి మండలం మట్టపల్లి శ్రీలక్ష్మీనరసింహస్వామి దేవాలయంలో శ్రీరాజ్యలక్ష్మి చెంచులక్ష్మీ సమేత శ్రీలక్ష్మీనరసింహస్వామి నిత్య కల్యాణాన్ని బుధవారం అర్చకులు వైభవంగా నిర్వహించారు. ఆలయంలో సుప్రభాతసేవ, పంచామృతాభిషేకం, నిత్య హోమం పూర్తిగావించారు. స్వామి అమ్మవార్లను నూతన పట్టు వస్త్రాలతో అలంకరించి ఎదుర్కోళ్ల మహోత్సం చేపట్టారు. విశ్వక్సేన ఆరాధన, పుణ్యాహవచనం, రక్షాబంధనం, రుత్విగ్వరణం, పంచగవ్యప్రాశన, మధుఫర్క పూజ, మాంగల్యధారణ, తలంబ్రాలతో కల్యాణతంతు ముగించారు. అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు.కార్యక్రమంలో ఆలయ అనువంశిక ధర్మకర్తలు చెన్నూరు మట్టపల్లిరావు, విజయ్‌కుమార్,ఈఓ నవీన్‌కుమార్, అర్చకులు లక్ష్మణాచార్యులు, పద్మనాభాచార్యులు. బదరీనారాయణాచార్యులు, లక్ష్మీనరసింహమూర్తి, ఆంజనేయాచార్యులు తదితరులు పాల్గొన్నారు.

భక్తులకు ఇబ్బందులు లేకుండా చూడాలి



సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి



మంత్రి కోమటిరెడ్డికి లడ్డూప్రసాదాన్ని అందజేస్తున్న ఈఓ

- యాదాద్రి కొండపై మౌలిక సౌకర్యాలు కల్పించాలి
- త్వరలోనే 'బస్వాపురం' సమస్యను పరిష్కరిస్తాం
- అధికారుల సమావేశంలో మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి

యాదగిరిగుట్ట రూరల్ : యాదాద్రి క్షేత్రంలో భక్తులకు ఇబ్బందులు కలగకుండా చూడాలని ఆర్‌అండ్‌బీ, సినిమాటోగ్రఫీ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి కోరారు. యాదగిరిగుట్ట ప్రెసిడెన్షియల్ అతిథిగృహంలో బుధవారం అధికారులతో సమీక్ష నిర్వహించి మాట్లాడారు. క్షేత్రానికి వచ్చే రాబడి కోసం కాకుండా భక్తులకు కావాల్సిన అవసరాలపై పట్ల దృష్టి సారించాలన్నారు. అభివృద్ధి సంక్షేమ పథకాలు ప్రజలకు సకాలంలో అందేలా చర్యలు తీసుకోవాలన్నారు. కొద్దిరోజుల్లో సీఎం రేవంత్‌రెడ్డిని ఆహ్వానించి, యాదగిరిగుట్ట, బస్వాపురం ప్రాజెక్టు సమస్యలు పరిష్కరిస్తామని చెప్పారు. యాదగిరిగుట్టకు మంజూరైన కోర్టు కోసం భవనాన్ని నిర్మించాలన్నారు. బస్వాపురం ప్రాజెక్టుకు సంబంధించి, 3 లక్షల క్యుబిక్ మీటర్ల బండ్ వర్క్ 93శాతం పూర్తయిందని, 11.39 టీఎంసీ నీళ్లను నిల్వచేయవచ్చని, ముంపు బాధితులకు నష్టపరిహారం పునరావాసం చర్యలు చేపట్టాలన్నారు. మల్లన్న సాగర్ నుంచి 16 కిలోమీటర్ల పైప్‌లైన్ బ్యాలెన్స్ వర్క్ నెలలో పూర్తిచేసి మిషన్ భగీరథ తాగునీరు అందించాలన్నారు. విద్యుత్ ఓవర్‌లోడ్ సమస్యలు తలెత్తకుండా చూడాలన్నారు. సమావేశంలో ఆయన వెంట ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య, కలెక్టర్ హనుమంతు కే. జెండగే, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ జి.వీరారెడ్డి, రెవెన్యూ అదనపు కలెక్టర్ భాస్కర్ రావు, వైటీడీఏ వైస్ చైర్మన్ కిషన్ రావు, ఈఓ రామకృష్ణారావు, డీసీపీ రాజేష్‌చంద్ర, మున్సిపల్ చైర్‌పర్సన్ ఎరుకల సుధ తదితరులు పాల్గొన్నారు.

యాదగిరీశుడిని దర్శించుకున్న మంత్రి

యాదాద్రి శ్రీ లక్ష్మీనరసింహస్వామి వారి ఆలయాన్ని అంతకుముందు ఆర్‌అండ్‌బీ, సినిమాటోగ్రఫీ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి దర్శించుకున్నారు. ఆలయ అధికారులు, అర్చకులు ఆయనకు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. ప్రధానాలయంలోని స్వయంభూవులను దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ప్రధానాలయం ముఖమండపంలోని ఉత్సవ మూర్తుల వద్ద పూజలు చేశారు. ఆలయంలోని ధ్వజస్తంభానికి మంత్రి మొక్కులు చెల్లించారు. అనంతరం వేద మండపంలో ఆలయ ఆచార్యులు వేద ఆశీర్వచనాలను జరిపించగా, లడ్డూ ప్రసాదాన్ని ఆలయ ఈఓ మంత్రి వెంకట్‌రెడ్డికి అందజేశారు. ఆయన వెంట ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య, కలెక్టర్ హనుమంతు కే.జెండగే, తదితరులున్నారు.

ఓటు హక్కును వినియోగించుకోవాలి

- రిటైర్డ్ ఐఏఎస్ చోల్లేటి ప్రభాకర్



సమావేశంలో మాట్లాడుతున్న చొల్లేటి ప్రభాకర్

కోదాడఅర్బన్ : ప్రజాస్వామ్యంలో ఓటు ఎంతో విలువైందని, ప్రజలు తమ హక్కును నిజాయితీగా వినియోగించుకోవాలని రిటైర్డ్ ఐఏఎస్ అధికారి చోల్లేటి ప్రభాకర్ పిలుపునిచ్చారు. బుధవారం కేఆర్‌ఆర్ ప్రభుత్వ డిగ్రీ ఆర్ట్స్, సైన్స్ కళాశాలలో రాజనీతిశాస్త్రం విభాగం, ఎన్ఎస్ఎస్ విభాగాల ఆధ్వర్యంలో భారత రాజ్యాంగం-ఓటు హక్కు ప్రాధాన్యత అనే అంశంపై డిగ్రీ విద్యార్థులకు నిర్వహించిన అవగాహన సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. కలలు కనండి సాకారం చేసుకోండి అనే అబ్దుల్ కలాం మాటలను ఆచరణలో పెడితే విజయం మీ సొంతం అవుతుందన్నారు. ఎన్నికల్లో అవనీతి, బంధు ప్రీతికి తావు లేకుండా ఓటు వేసినప్పుడే మంచి పాలన, పాలకుడు వస్తాడన్నారు. అనతరం రిటైర్డ్ ఐఏఎస్ ప్రభాకర్ రచించిన యూపీఎస్సీ సివిల్స్ ఎగ్జామ్, ఫైర్ ఆక్స్ హిం ఐఏఎస్ అనే పుస్తకాన్ని కళాశాల సిబ్బందికి, విద్యార్థులకు అందించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ ప్రభాకర్‌ను కళాశాల అధ్యాపకులతో కలిసి సత్కరించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ నాగు, రిటైర్డ్ ఇంటర్ విద్యాధికారి రాజారాంసింగ్, నిర్మల, రాజనీతి అధ్యాపకులు సైదమ్మ, ఎస్ఎం రఫీ, ఇంకా ప్రకాష్, రమేష్, వెంకటేశ్వరరెడ్డి, పాల్గొన్నారు.

జాతీయ స్థాయి కబడ్డీ పోటీలకు ఎంపిక



సంపత్

హాలియా : జాతీయస్థాయి కబడ్డీ పోటీలకు పెద్దవూర మండలం కేకే తండాకు చెందిన సంపత్ ఎంపికై నట్లు కోచ్ ఆవుల చంద్రశేఖర్ యాదవ్ తెలిపారు. బుధవారం స్థానికంగా ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. 67వ స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ -19 బాలుర విభాగంలో సంపత్ పాల్గొని ప్రతిభ కనబర్చి తెలంగాణ రాష్ట్ర కబడ్డీ జట్టుకు ఎంపికైనట్లు వివరించారు. ఈనెల 24వ తేదీ నుంచి 28వ తేదీ వరకు కర్ణాటక రాష్ట్రంలో జరగబోయే జాతీయస్థాయి కబడ్డీ పోటీల్లో పాల్గొననున్నట్లు తెలిపారు. సంపత్ నల్లగొండలోని ఎస్ఆర్ జూనియర్ కాలేజీలో ఇంటర్ ప్రథమ సంవత్సరం చదువుతున్నాడని తెలిపారు.

కబడ్డీ పోటీలకు రాముడు



రాముడు

హుజూర్‌నగర్ (చింతలపాలెం) : చింతలపాలెం మండలం కొత్తగూడెం గ్రామానికి చెందిన మాళావత్ రాముడు కర్నాటకలోని మాండ్య జిల్లాలో ఈ నెల 27 వరకు జరిగే జాతీయ స్థాయి కబడ్డీ అండర్ 19 జట్టుకు ఎంపికై నట్లు జైహనుమాన్ స్పోర్ట్స్ క్లబ్ ప్రధాన కార్యదర్శి మోర్తాల నాగిరెడ్డి బుధవారం తెలిపారు. రాముడు ఎంపిక పట్ల పలువురు హర్షం వ్యక్తం చేశారు.

చెత్తకుప్పలో మగ శిశువు

- హైదరాబాద్‌కు తరలించగా ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి

కొండమల్లేపల్లి : అప్పుడే పుట్టిన మగ శిశువును చెత్తకుప్పలో వదలేసి మాతృత్వానికి మచ్చ తెచ్చిన ఘటన కొండమల్లేపల్లి మండల కేంద్రంలో బుధవారం చోటుచేసుకుంది. పోలీసులు, స్థానికులు తెలిపిన ప్రకారం వివరాలిలా ఉన్నాయి. కొండమల్లేపల్లి మండల కేంద్రంలోని సాగర్ రోడ్డులోని వాసవీ బజార్‌లో బోయ సంధ్య ఇంటి వెనక గుర్తుతెలియని వ్యక్తులు అప్పుడే జన్మించిన మగ శిశువును చెత్తకుప్పలో వదిలేసి వెళ్లిపోయారు. బుధవారం ఉదయం శిశువు ఏడుపును గమనించిన రమావత్ రజిత అక్కడికి చేరుకొని చూడగా శిశువు కనిపించడంతో చుట్టుపక్కల వారికి సమాచారం ఇచ్చింది. దీంతో సమాచారం ఐసీడీఎస్ అధికారులు, కొండమల్లేపల్లి ఎస్ఐ వీరబాబు శిశువును దేవరకొండలోని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. కాగా మెరుగైన వైద్యం కోసం శిశువును నీలోఫర్ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతిచెందాడు. శిశువు పెదవి సరిగా లేకపోవడం, గ్రహణం పట్టినట్లుగా ఉండడంతోనే వదిలేసి ఉండొచ్చని పలువురు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. శిశువును ఆస్పత్రికి తీసుకెళ్లిన వారిలో సూపర్‌వైజర్ రాధ, 9వ వార్డు మెంబర్ బొడిగె లక్ష్మీశ్రీ, అంగన్‌వాడీ టీచర్ శోభ, జ్యోత ఆయా మాణిక్యమ్మ తదితరులున్నారు.

కమ్యూనిటీ పారామెడిక్ శిక్షణను ప్రారంభించాలి



మాట్లాడుతున్న శంకర్ ముదిరాజ్

నేరేడుచర్ల : రాష్ట్రంలో ఉన్న ఆర్ఎంపీలు, పీఎంపీలకు కమ్యూనిటీ పారామెడిక్ శిక్షణను ప్రారంభించాలని ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు సాప్పరి శంకర్ ముదిరాజ్ అన్నారు. బుధవారం ఆయన నేరేడుచర్ల, పాలకీడు మండలాల ఆర్ఎంపీ, పీఎంపీల సర్వసభ్య సమావేశంలో పాల్గొని మాట్లాడారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తరువాత గత ప్రభుత్వం ఆర్ఎంపీ, పీఎంపీల సమస్యలను పరిష్కరించడంలో పూర్తిగా విఫలమైందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల మేనిఫెస్టోలో పొందుపరిచిన విధంగా ఆర్ఎంపీ, పీఎంపీలకు పారామెడిక్ శిక్షణను పూర్తి చేసిన తరువాత పరీక్షలు నిర్వహించి సర్టిఫికెట్లు అందించాలని డిమాండ్ చేశారు. అనంతరం ఆర్ఎంపీ, పీఎంపీల నూతన క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఆ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు తన్నీరు సత్యనారాయణ, సూర్యాపేట జిల్లా ప్రధాన కార్యదర్శి వెంకన్న గౌడ్, ఉపాధ్యక్షుడు మన్సూర్ అలీ, కస్తాల వెంకన్న, పిచ్చయ్య, సైదులు, జానయ్య ఉన్నారు.

మద్యం మత్తులో యువకుల వీరంగం

సూర్యాపేట క్రైం : తాగిన మత్తులో ఓ మండల ప్రజాప్రతినిధి కుమారుడు వీరంగం సృష్టించాడు. నలుగురు యువకులతో కలిసి రోడ్డుపై వెళ్తున్న ఆటో డ్రైవర్‌పై తూకం రాయితో దాడి చేయడంతో తల పగిలిన ఘటన సూర్యాపేట జిల్లా కేంద్రంలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం...ఓ మండల ప్రజాప్రతినిధి కుమారుడు నెమ్మాది బిట్టు స్నేహితులతో మద్యం సేవించాడు. స్నేహితులు నిఖిల్, బిట్టు మధ్య తాగిన మైకంలో ఘర్షణకు దిగారు. ఈ క్రమంలో బిట్టు నిఖిల్‌ను కొట్టుకుంటూ ఖమ్మం చౌరస్తా వద్దకు చేరుకున్నారు. ఈ నేపథ్యంలో నిఖిల్‌పై ఆవేశంతో పక్కనే ఉన్న తూకం రాయి తీసుకొని విసరడంతో అటువైపు వెళ్తున్న జానీ అనే ఆటో డ్రైవర్‌కు తగలడంతో తలకు తీవ్రమైన గాయమైంది. అనంతరం అక్కడి నుంచి యువకులు పరారయ్యారు. అక్కడే ఉన్న స్థానికులు జానీని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. జానీ ఫిర్యాదు మేరకు బిట్టు, నిఖిల్‌తో పాటు మరో ఇద్దరు యువకులపై పోలీసులు కేసు నమోదు చేశారు. ప్రస్తుతం పోలీసులు నిఖిల్‌ను అదుపులోకి తీసుకోగా బిట్టు పరారీలో ఉన్నట్లు పట్టణ సీఐ రాజశేఖర్ తెలిపారు.

కుక్కల దాడిలో గొర్రెలు మృతి

రాజాపేట : కుక్కల దాడిలో పలు గొర్రెలు మృతిచెందాయి. ఈ ఘటన రాజాపేట మండలంలోని సోమారం గ్రామంలో చోటుచేసుకుంది. రైతు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన రైతు పుప్పాల బాలనర్సయ్య ఇటీవల గొర్రెలు కొనుగోలు చేశాడు. వాటిని గతంలో ఉన్న గొర్రెలతో కలిపి మంగళవారం రాత్రి తన కొట్టంలో కట్టివేశాడు. కాగా అర్ధరాత్రి వేళ వీధికుక్కలు కొట్టంలోకి చొరబడి గొర్రలపై విచక్షణారహితంగా దాడిచేసి తీవ్రంగా గాయపరిచాయి. ఉదయం రైతు వచ్చి చూసేసరికి 8 గొర్రెలు మృతి చెందాయి. రూ. 90వేల వరకు నష్టం వాటిల్లిందని రైతు ఆవేదన వ్యక్తం చేశాడు. కుక్కలను నివారించాలని అధికారులను వేడుకుంటున్నాడు.

గంజాయి చాక్లెట్ల పట్టివేత



స్వాధీనం చేసుకున్న గంజాయి చాక్లెట్లు

భువనగిరి క్రైం : గంజాయి చాక్లెట్లను రవాణా చేస్తున్న వ్యక్తిని బుధవారం ఎక్సైజ్ భువనగిరి పోలీసులు అరెస్టు చేశారు. ఎక్సైజ్ సీఐ బి.నాగిరెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. గంజాయి చాక్లెట్ల రవాణా చేస్తున్న ఒడిశా రాష్ట్రానికి చెందిన తపన్ కుమార్ పరిడ భువనగిరి రైల్వే స్టేషన్‌లో అనుమానాస్పదంగా ఉండగా టాక్స్‌ఫోర్స్, ఎక్సైజ్ స్టేషన్స్ టీంల ఆధ్వర్యంలో అతడిని అదుపులోకి తీసుకున్నారు. అతడిని తనిఖీ చేసి 24 ప్యాకెట్లలో 869 గంజాయి చాక్లెట్లు, మొబైల్ ఫోన్‌ను స్వాధీనం చేసుకున్నారు. ఈ గంజాయి చాక్లెట్ల బరువు సుమారు 4.557 కిలో గ్రాములు ఉన్నాయి. ఈ దాడుల్లో అధికారులు బి.రాధకిషన్, ఎస్ఐలు పి.సాయికిరణ్‌రెడ్డి, జి.నాగరాజు ఉన్నారు.

చంపేసి.. ఆపై కాల్చేశారు !

- భువనగిరి మండలం నాగిరెడ్డిపల్లి శివారులో దారుణం
- హతుడిని గుర్తుపట్టకుండా పెట్రోల్‌తో కాల్చేసినట్లు ఆనవాళ్లు

భువనగిరి క్రైమ్ : యాదాద్రి భువనగిరి జిల్లా భువనగిరి మండలం నాగిరెడ్డిపల్లి గ్రామ శివారులో బుధవారం దారుణం వెలుగుచూసింది. గుర్తుతెలియని వ్యకిని హత్య చేసి గుర్తుపట్టకుండా హతుడి ముఖం ఇతర శరీర భాగాలను పెట్రోల్‌తో కాల్చేసినట్లు ఆనవాళ్లు ఉన్నాయి. నాగిరెడ్డి గ్రామ శివారులోని కాళేశ్వరం కాల్వలో గుర్తుతెలియని వ్యక్తి మృతదేహాన్ని గొర్రెల కాపరులు గుర్తించారు. వారు ఇచ్చిన సమాచారం మేరకు ఘటన స్థలాన్ని భువనగిరి ఏసీపీ సాయిరెడ్డి వెంకట్‌రెడ్డి, ఇతర పోలీస్ సిబ్బంది పరిశీలించారు. మృతదేహం పూర్తిగా కుళ్లిపోవడంతో దుండగులు వారం రోజుల క్రితమే హత్య చేసి ఉంటారని భావిస్తున్నారు. హతుడు సుమారు 5.4 అంగుళాల ఎత్తు, నీలి రంగు జీన్స్ ప్యాంటు, మెరూన్ కలర్ టీషర్ట్ ధరించి ఉన్నాడు. హతుడు ఎవరు..? ఎక్కడో హత్య చేసి ఇక్కడికి తీసుకొచ్చి కాల్చేశారా..? ఇక్కడే చంపేసి ఆపై ఆనవాళ్లు దొరక్కుండా చేశారా? హత్యకు గల కారణాలు ఏమిటి? ఇలా పలు కోణాల్లో పోలీసులు దర్యాప్తు ముమ్మరరం చేశారు. తొలుత మిస్సింగ్ కేసులపై దృష్టి సారించినట్లు పోలీసులు తెలిపారు. మృతదేహం పూర్తిగా కుళ్లిపోవడంతో ఘటనాస్థలిలోనే పోస్టుమార్టం నిర్వహించి ఖననం చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఏసీపీ తెలిపారు.

ప్లాస్టిక్ అనర్థాలపై అవగాహన కల్పించాలి

- ఎంజీయూ వీసీ గోపాల్‌రెడ్డి



మాట్లాడుతున్న ఎంజీయూ వీసీ గోపాల్‌రెడ్డి

ఎంజీయూ(నల్లగొండ రూరల్) : ప్లాస్టిక్ వాడకం వల్ల కలిగే అనర్థాలపై ప్రజల్లో అవగాహన కల్పించాలని మహాత్మాగాంధీ యూనివర్సిటీ వీసీ గోపాల్ రెడ్డి కోరారు. బుధవారం ఎంజీయూలో ఎన్ఎస్ఎస్ పోగ్రాం ఆఫీసర్ల సమాశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. యూనివర్సిటీ పరిధిలో 163 ఎన్ఎస్ఎస్ యూనిట్లు ఏర్పాటు చేసి మంచి కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమన్నారు. అధునాతన పోకడలతో పోటీపడుతున్న తరుణంలో మంచి చెడులను ప్రజలకు తెలియజేయాలని కోరారు. సాంకేతిక పరిజ్ఞానం క్షేత్ర స్థాయికి చెరితేనే ఫలితాలు సాధిస్తామన్నారు. ఇటీవల మహారాష్ట్రలోని నాసిక్‌లో జరిగిన నేషనల్ యూత్ ఫెస్టివల్‌లో యూనివర్సిటీ నుంచి పలు కార్యక్రమాలపై ప్రదర్శనలు ఇచ్చి ప్రతిభ కనబర్చిన వలంటర్లకు ప్రశంసా పత్రాలను అందజేసి అభినందించారు. సమావేశంలో రిజిస్ట్రార్ రవి, ఎన్ఎస్ఎస్ అధికారులు మౌనిక, మద్దిలేటి ఈసీ సభ్యులు కృష్ణారెడ్డి పాల్గొన్నారు.

సాగర్‌లో ఫిల్టర్ హౌస్ సామగ్రి చోరీ



జలాశయ తీరం నుంచి వేసిన పైపులైన్ వెంట తొలగించిన సపోర్ట్ రాడ్స్

నాగార్జునసాగర్: సాగర్ జలాశయతీరంలో సుమారు కోటిరూపాయలతో నిర్మించిన ఫిల్టర్‌హౌస్ సామగ్రిని దుండగులు అపహరించారు. జలాశయతీరం నుంచి పైవరకు వేసిన పైపులైన్‌ట్రాక్, నీటిపైపుల వెంట సపోర్ట్‌గా వేసిన ఇనుప చానల్ పట్టీలు, మోటార్లు, గేట్‌వాల్స్ సకలం కనపడకుండా పోయాయి. గ్యాస్‌కట్టర్లను తెచ్చి ట్రాక్‌ను ముక్కలుగా చేస్తూ నిత్యం ఆటోల్లో ఇనుప సామగ్రిని తరలిస్తున్నట్లు సమాచారం. ఆ భూమిలో ఉన్న కంపచెట్లను తొలగించడంతో గ్యాస్‌కట్టర్లు, గ్యాస్ సిలిండర్, విద్యుత్ వైర్లు కనపడ్డాయి. దీంతో అధికారులు అప్రమత్తం అయ్యారు. ఈ పాటికే కింది నుంచి పైవరకుగల కేబుల్ వైరు అందిన కాడికి సామగ్రినంతా దుండగులు తరలించుక పోయారు. ఈ ఘటనపై బుధవారం స్థానిక పోలీస్టేషన్‌లో ఎన్నెస్పీ అధికారులు ఫిర్యాదు చేశారు. దర్యాప్తు ప్రారంభించిన పోలీసులు చోరీలో ఎన్నెస్పీ ఉద్యోగుల పాత్రపై ఆరాతీస్తున్నట్లు సమాచారం.

రేషన్ బియ్యం పట్టివేత

చౌటుప్పల్ : మండల పరిధిలోని పంతంగి టోల్ ప్లాజా వద్ద బుధవారం పోలీసులు రేషన్ బియ్యాన్ని పట్టుకున్నారు. సీఐ ఎస్.దేవేందర్ తెలిపిన వివరాల ప్రకారం.... యాదగిరిగుట్ట మండలం లప్పానాయక్‌తండాకు చెందిన ధీరావత్ మదు (22), అదే గ్రామానికి చెందిన ధీరావత్ రాము (23)లు సూర్యాపేట జిల్లాలోని పలు గ్రామాల్లో రేషన్ బియ్యాన్ని కొనుగోలు చేస్తుంటారు. ఆయా గ్రామాల్లో0 10రూపాయల చొప్పున కొనుగోలు చేసే వీరు రంగారెడ్డి జిల్లా శంషాబాద్ పరిసరాల్లోని రైస్‌మిల్లుల్లో 15రూపాయల వంతున అమ్ముతుంటారు. అందులో భాగంగా అశోకా లీలాండ్ ఆటోలో 40 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని తరలిస్తుండగా టోల్‌ప్లాజా వద్ద పోలీసులు పట్టుకున్నారు. బియ్యం, ఆటోను స్వాధీనం చేసుకున్నారు. పట్టుబడిన ఇద్దరు వ్యక్తులపై కేసు నమోదు చేశారు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నామని సీఐ తెలిపారు.

మత్స్యకారులకు చిక్కిన 'వెండి' చేపలు



మత్స్యకారుల వలకు చిక్కిన పలితెజల్ల చేపలు

మఠంపల్లి : సూర్యాపేట జిల్లా మఠంపల్లి మండలం యాతవాకిల్ల వద్ద గల వేములూరు రిజర్వాయర్‌లో మత్స్యకారుల వలకు 10 నుంచి 15కేజీల పలితె (వెండి) జల్ల చేపలు చిక్కాయి. కృష్ణానదిలో మాత్రమే 2 నుంచి 3 కేజీల బరువుతో లభ్యమయ్యే పలితెజల్ల చేపలు వేములూరు రిజర్వాయర్‌లో మత్స్యకారుల వలకు చిక్కడంతో సంతోషం వ్యక్తం చేస్తున్నారు. వేములూరు రిజర్వాయర్‌లో నీరు రోజు రోజుకూ అడుగంటుండటంతో ఎప్పుడూ దొరకని చేపలు మత్స్యకారులకు లభ్యమవుతున్నాయని సర్పంచ్ కోలాహలం లక్ష్మీనరసింహరాజు తెలిపారు. ఆయన వెంట మాజీ సర్పంచ్ కృష్ణంరాజు, బీసీసెల్ మండల అధ్యక్షుడు ఎల్లావుల నాగయ్యయాదవ్, వెంకటేశ్వర్లు తదితరులున్నారు.

సాయం చేసేందుకు వెళ్తూ మృత్యుఒడికి

- డీసీఎం ఢీకొని డ్రైవర్ దుర్మరణం
- మృతుడు ఏపీలోని నంద్యాల వాసి

నల్లగొండ క్రైం : రోడ్డు పక్కన వాహనాన్ని నిలిపి సాయం చేసేందుకు నడుచుకుంటూ వెళ్తున్న ఓ డీసీఎం డ్రైవర్‌ను మరో డీసీఎం ఢీకొట్టడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. నల్లగొండ పట్టణ శివారులో చోటు చేసుకున్న ఈ ఘటన వివరాలు ఇలా ఉన్నాయి. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం నంద్యాల పట్టణంలోని వీకర్ సెక్షన్ కాలనీకి చెందిన మహ్మద్ ఆరీఫ్ (26) డీసీఎం డ్రైవర్‌గా జీవనం సాగిస్తున్నాడు. ఆరీఫ్ తన డీసీఎంలో బియ్యాన్ని లోడు చేసుకుని హైదరాబాద్‌కు బయలుదేరాడు. మార్గమధ్యలో మంగళవారం అర్ధరాత్రి నల్లగొండ పట్టణ శివారు పానగల్ బైపాస్‌కు చేరుకున్నాడు. ఈ క్రమంలో అక్కడ మిర్చిలోడుతో వెళ్తున్న మినీ ఆటో టైరు పంక్చర్ కావడంతో అదుపుతప్పింది. దీంతో ఆటోలోని మిర్చి బస్తాలు రోడ్డుపై పడిపోయాయి. దీనిని గమనించి ఆరీఫ్ తన వాహనాన్ని రోడ్డు పక్కన నిలిపి ఆటో డ్రైవర్‌కు సహాయం చేసేందుకు నడుచుకుంటూ వెళ్తుండగా హైదరాబాద్ వైపు వెళ్తున్న మరో డీసీఎం ఆరీఫ్‌ను ఢీకొట్టింది. ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన ఆరీఫ్ అక్కడికక్కడే మృతిచెందాడు. మృతుడి సోదరుడు బషీర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు నల్లగొండ టూటౌన్ ఎస్ఐ నాగరాజు తెలిపారు.

బాలుడి హత్య కేసులో జీవిత ఖైదు

- ప్రియుడితో కలిసి కన్నకొడుకును గొంతునులిమి చంపిన తల్లి
- ఇద్దరికి జైలుశిక్ష విధిస్తూ కోర్టు తీర్పు

రామగిరి(నల్లగొండ): ప్రియుడితో కలిసి తొమ్మిదేళ్ల కుమారుడిని కడతేర్చిన కేసులో ఇద్దరికి జీవిత ఖైదు విధిస్తూ నల్లగొండ ప్రధాన న్యాయమూర్తి నాగరాజు బుధవారం తీర్పు వెల్లడించారు. నల్లగొండ మండలం బుద్ధారం గ్రామానికి చెందిన పల్లెటి వెంకన్నకు నాంపల్లి మండలం సల్లవానికుంట గ్రామానికి చెందిన విజయతో 2007వ సంవత్సరంలో వివాహం జరిగింది. వీరికి అఖిల్, నాగరాజు సంతానం. వెంకన్న ట్రాక్టర్ డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. భార్య విజయ వ్యవసాయ కూలీగా పనిచేస్తోంది. అదే గ్రామానికి చెందిన తోకల వెంకట్‌రెడ్డి వద్ద భార్యభర్తలు కూలికి వెళ్తుంటారు. ఈ క్రమంలో తోకల వెంకట్‌రెడ్డి విజయతో వివాహేతర సంబంధం పెట్టుకున్నాడు. ఒక రోజు విజయతో పాటు చిన్న కుమారుడు నాగరాజు పని ప్రదేశానికి వెళ్లాడు. ఆ రోజు వెంకట్‌రెడ్డితో విజయ కలిసి ఉండగా నాగరాజు చూసి తండ్రి వెంకన్నకు చెప్పాడు. దీంతో విజయ, వెంకట్‌రెడ్డిలను వెంకన్న మందలించి పద్ధతి మార్చుకోవాలని హెచ్చరించాడు.

విషయం తండ్రికి చెప్తాడని గొంతు నులిమి..

కొన్ని రోజుల తర్వాత 2020 ఫిబ్రవరి 21వ తేదీన వెంకట్‌రెడ్డి ఫోన్ చేసి పనికి రావాలని వెంకన్నను కోరగా వెళ్లాడు. గంట తర్వాత వెంకన్న తిరిగి ఇంటికి వచ్చాడు. అనంతరం పని నిమిత్తం రాముల బండ గ్రామానికి వెళ్లాడు. ఈ క్రమంలో వెంకట్‌రెడ్డి వెంకన్న ఇంటికి వచ్చి విజయతో కలిసి ఉన్నాడు. దీనిని విజయ చిన్నకుమారుడు నాగరాజు చూశాడు. విషయం తండ్రికి చెప్తాడని కంగారు పడిన విజయ, వెంకట్‌రెడ్డిలు నాగరాజు(9)ను గొంతు నులిమి చంపేశారు. వెంకన్న ఇంటికి వచ్చి చూడగా కొడుకు మంచంలో విగతజీవిలా పడి ఉన్నాడు. నాగరాజు గొంతుపై నులిమిన ఆనవాళ్లు ఉన్నాయి. భార్య విజయ కనిపించలేదు. గ్రామస్తులను ఆరా తీయగా వెంకన్న ఇంట్లో లేని సమయంలో మధ్యాహ్నం వెంకట్‌రెడ్డి ఇంటికి వచ్చినట్లు చెప్పారు. దీంతో అనుమానం వచ్చిన వెంకన్న నల్లగొండ రూరల్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేసిన సీఐ ప్రసాద్, ఎస్ఐ కె.చంద్రశేఖర్‌రెడ్డి నిందితులను అరెస్టు చేసి కోర్టులో హాజరుపరిచారు. కానిస్టేబుల్ ఎస్.సురేష్, బి.సుమన్, కోర్టు లైజన్ ఆఫీసర్ పి.నరేందర్ ఆధారాలు కోర్టుకు సమర్పించారు. పబ్లిక్ ప్రాసిక్యూటర్ ఎస్.శ్రీనివాస్ వాదనలతో ఏకీభవించిన నల్లగొండ జిల్లా ప్రధాన న్యాయమూర్తి నాగరాజు ఏ1 విజయ, ఏ2 వెంకట్‌రెడ్డిలకు జీవిత ఖైదుతో పాటు రూ. వెయ్యి జరిమానా విధిస్తూ తీర్పు వెలువరించారు.